# అసెంబ్లీ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

*ఉదయం 7 గంటల్లోపే వాకింగ్ ముగించుకోవాలని సూచన*

సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాలు శనివారం నుంచి జరుగనుండటంతో అసెంబ్లీకి 4 కిలోమీటర్ల పరిసర ప్రాంతాలలో ఆంక్షలు ఉంటాయని నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది గుమికూడడం, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించ రాదని సీపీ సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి, ప్రశాంతతకు భంగం కల్గించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలు ముగిసే వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు.

### 7 గంటల్లోపే వాకింగ్

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పబ్లిక్ గార్డెన్స్, అసెంబ్లీ పరిసరాల్లో వాకింగ్ చేసే వారు ఉదయం 7 గంటల లోపు వాకింగ్ ముగించుకోవాలని అసెంబ్లీ అధికారులు తెలిపారు. 7 గంటల తరువాత పోలీసు బందోబస్తు ఆంక్షలు ఉండడంతో, సామాన్య ప్రజలను అటు వైపు అనుమతించరన్నారు.



## కేసీఆర్ కోలుకోవాలని ఓయూలో ప్రత్యేక పూజలు

- కాంగ్రెస్ నాయకులు హేళన చేస్తే.. చూస్తూ ఊరుకోం
- నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 8 : తెలంగాణ జాతిపిత, బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ ఆరోగ్యం త్వరితగతిన కోలుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యాంపస్‌లోని సరస్వతీ ఆలయంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం మానవతారాయ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోయినా, ప్రజల హృదయాల్లో కేసీఆర్ ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి ఉంటారని చెప్పారు. ప్రజలు మార్పు కోరారు కానీ కేసీఆర్‌ను దూరం చేసుకోలేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా కేసీఆర్‌కు రక్షగా ఉంటాయని అన్నారు. కేసీఆర్‌ను కాంగ్రెస్ నాయకులు హేళన చేస్తే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కొండ గణేశ్, డాక్టర్ ఇనుగుర్తి శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మణికంఠ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టులో న్యాయవాదుల నిరసన



రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): కర్ణాటక రాష్ట్రంలోని కలబుర్గిలో పట్టపగలు కోర్టు ఆవరణలోనే న్యాయవాదిని హత్య చేయడాన్ని నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా న్యాయవాదులు కోర్టు ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని ఏర్పరిచి, దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి దీకొండ రవీందర్, పట్లోళ్ళ మాధవరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రమణారావు, రామకృష్ణ, జూపూడి సుందర్‌రావుతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎంగా బీసీలకు అవకాశం కల్పించాలి

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్**



అభివాదం చేస్తున్న శ్రీనివాస్ గౌడ్, బీసీ నేతలు

ఖైరతాబాద్, డిసెంబర్ 8: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ కేబినెట్‌లో బీసీలకు ఉపముఖ్యమంత్రిగా అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు చట్టసభల్లో బీసీలకు ప్రాధాన్యత అంతంత మాత్రమేనన్నారు. రాష్ట్ర జనాభాలో సగం కంటే ఎక్కువగా ఉన్న బీసీలు కేవలం ఓటు బ్యాంకుగానే పనికొస్తున్నారని, రాజ్యాధికారం దక్కడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని, హైదరాబాద్‌లో పూలే భవన్ నిర్మించడంతో పాటు పూలే స్మృతివనం, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించాలన్నారు. ప్రమాదవశాత్తు గాయపడి యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, ఆయన ప్రజలకు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి, గొల్ల కురుమ సంఘం నాయకులు చిన శ్రీశైలం గౌడ్, విక్రమ్‌గౌడ్, దుర్గయ్య గౌడ్, శేఖర్ సగర తదితరులు పాల్గొన్నారు.

## పీజీ విద్యార్థులకు కంటిన్యూస్ ఎవాల్యుయేషన్ ప్రాసెస్ అమలు

సుల్తాన్ బజార్, డిసెంబర్ 8 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో మొట్టమొదటి సారి పీజీ సెమిస్టర్ రాసే విద్యార్థులకు కంటిన్యూస్ ఎవాల్యుయేషన్ ప్రాసెస్‌ను అమలు చేయడం సంతోషంగా ఉన్నదని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.రవీందర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షా కేంద్రాన్ని ఆయన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.లక్ష్మణ్‌నాయక్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

## పార్టీ మారే ప్రసక్తే లేదు..

- అబద్ధాలను నమ్మి మోసపోయారు.. మళ్లీ మోసపోవద్దు
- ప్రతిపక్షంలో ఉండి సమస్యలపై గళ మెత్తుతా..
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, డిసెంబర్ 8 : అబద్ధపు ప్రచారాలతో పాటు తప్పుడు ఆరోపణలను నమ్మి నిరంతరం తెలంగాణ అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం గురించి ఆలోచించే కేసీఆర్‌ను అధికారానికి దూరం చేయడం బాధాకరమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, జవహర్ కాలనీలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఆయన గెలుపుకోసం కృషిచేసిన కార్యకర్తలను అభినందించారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేశారని, వారందరికీ అండగా నిలుస్తానన్నారు. తన రాజకీయ జీవితంలో కేసీఆర్ లాంటి నేతను ఇప్పటిదాకా చూడలేదని, నిరంతరం పేదల కోసం తాపత్రయపడే కేసీఆర్ ప్రమాదంలో గాయపడడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే కేసీఆర్ కోలుకుని ప్రజల కోసం పనిచేస్తారని చెప్పారు. అధికారంలో లేకున్నా ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలను పరిష్కరించడంతోపాటు శాసనసభలో గళమెత్తుతానని పేర్కొన్నారు. తాను పార్టీ మారుతానంటూ కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారి మాటలు నమ్మవద్దని సూచించారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఎలాంటి పాలన అందిస్తుందో ఆరునెలల పాటు వేచి చూద్దామని, ఎంతో కష్టపడిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఆరునెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, బీఆర్ఎస్ నేతలు బోజిరెడ్డి, స్వామి గౌడ్, మంగళారపు లక్ష్మణ్, సునీల్, శంకర్, కిరణ్ యాదవ్, రుద్రముణి, భరత్, దీపాదేవి, జ్యోతి, చంద్రకళ, వాణి, తదితరులు పాల్గొన్నారు.

## బీమా జ్యువెల్లర్స్.. దుబాయ్ ట్రిప్ విజేతలు



జూబ్లీహిల్స్, డిసెంబర్ 8 : బీమా జ్యువెల్లర్స్ 99వ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన బ్రాంచ్ లెవల్ డ్రాలో దుబాయ్ ట్రిప్ విజేతలను ప్రకటించారు. కూకట్‌పల్లి బ్రాంచ్‌లో బోడపాటి పద్మ, చందానగర్ బ్రాంచ్‌లో టి.వెంకటరమణ, సోమాజిగూడ బ్రాంచ్‌లో పి.లలిత, ఏఎస్‌రావు నగర్ బ్రాంచ్‌లో సెనిగరం శ్రీకాంత్‌ను విజేతలుగా ఎంపిక చేశారు.

## కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని దర్గాలో ప్రార్థనలు



అబిడ్స్, డిసెంబర్ 8: బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆరోగ్యంగా ఉండాలని, తొందరగా కోలుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాంపల్లి యూసుఫేన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్, తదితరులున్నారు.

## కేవీ రమణాచారికి మోకాలి శస్త్ర చికిత్స



కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు మాజీ చైర్మన్ డాక్టర్ కేవీ రమణాచారి

తెలుగుయూనివర్సిటీ, డిసెంబర్ 8 : గత 15 రోజులుగా మోకాలి నొప్పులతో బాధపడుతున్న తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు మాజీ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారికి కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స పూర్తయింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉన్నప్పటికి మూడు రోజుల అనంతరం డిశ్చార్జీ చేయనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కనీసం నెల రోజుల పాటు ఫిజియోథెరపీ చేయించుకుంటూ పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు.